అనంతపురం/శ్రీ సత్యసాయి



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 23 ఫిబ్రవరి 2026 పేజీలు : 04


# రైస్ పుల్లింగ్ పేరుతో మోసాలకు పాల్పడే డికె బాబు అరెస్టు

- అతని నుంచి 5 రాగి చెంబులు, ఫార్చునర్ వాహనం, 3 సెల్‌ఫోన్లు, నగదు స్వాధీనం
- మీడియా సమావేశంలో డిఎస్పీ శివనారాయణస్వామి



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న డిఎస్పీ శివనారాయణస్వామి

**కదిరి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

రైస్ పుల్లింగ్ పేరుతో ప్రజలను మోసం చేస్తున్న చింత కృష్ణారెడ్డి అలియాజ్ డికె బాబును అరెస్టు చేసినట్లు డిఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. ఆదివారం కదిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో అందుకు సంబంధించిన వివరాలను డిఎస్పీ వివరించారు. తలుపుల మండలానికి చెందిన వైసిపి మండల కన్వీనర్ చింత కృష్ణారెడ్డి అలియాజ్ డికె బాబు (44) రైస్ పుల్లింగ్ పేరుతో మహిమగల రాగి చెంబు తయారు చేసి కోట్ల రూపాయలకు అమ్మవచ్చని నమ్మబలికి ఐదు రాష్ట్రాల్లో బాధితులకు మోసం చేశాడు. అయితే అదే మండలానికి చెందిన వేణుగోపాల్‌రెడ్డికి అలాగే మోసం చేశాడని ఫిర్యాదు వచ్చిందన్నారు. వచ్చిన ఫిర్యాదుపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టడంతో 2020జూన్‌లో రూ.5 లక్షలు, జులై నెలలో 5 లక్షలు తీసుకుని బాధితునికి మరిన్ని డబ్బులు ఇవ్వాలని కోరడంతో అనుమానం వచ్చి తన డబ్బును తిరిగి ఇవ్వాలని కోరాడన్నారు. ఈ నేపథ్యంలో సదరు ముద్దాయి. తన ఇంటికి పిలిపించి రాగి చెంబు ఇచ్చికొంత కాలం తర్వాత విక్రయించి ఇస్తానని చెప్పాడు. 2026 ఫిబ్రవరిలో ఫిర్యాదు దారుడు డబ్బులు కోరగా ముద్దాయి అతని ఇంట్లో బందించి నిన్ను చంపేస్తానని బెదిరించడంతో ఫిర్యాదు దారుడు స్నేహితుల ద్వారా 3 లక్షలు వసూలు చేసి ఇచ్చినట్లు తెలిపారు. మిగిలిన 7 లక్షలకు బలవంతంగా ప్రాంసరి నోట్లు రాయించుకుని సంతకాలు చేయించుకున్నట్లు వెల్లడించారు. ఈ విషయంపై తలుపుల పోలీస్‌స్టేషన్‌లో సిఆర్ నెంబర్ 10/2026 కింద సంబంధిత బిఎన్‌ఎస్ కేసు నమోదు చేశారు. శనివారం పోలీసులకు అందిన సమాచారం మేరకు కదిరి రూరల్ సిఐ నాగేంద్ర, తలుపుల ఎస్ఐ సిబ్బందితో కలిసి తనకల్లు మండలం, రాకుంటపల్లి సమీపంలో వాహనాలు తనిఖీ నిర్వహించే సమయంలో ఎపి40కెఎఫ్2349 నెంబర్‌గల ఫార్చునర్ కారులో డికె బాబును గుర్తించి అరెస్టు చేశామన్నారు. డికె బాబు నుంచి బ్లాక్ ఫారుచనర్ వాహనం, మూడు సెల్‌ఫోన్లు, నగదు రూ.1,08940, ఐదు రాగి చెంబులను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ తెలిపారు. డికె బాబుపై గతంలో తలుపుల పోలీస్‌స్టేషన్‌లో 7 కేసులు నమోదు కావడంతో రౌడీ షీట్ ఓపెన్ చేశామని, ప్రస్తుతం అతనిపై పిడి యాక్టు అమలుపై జిల్లా ఎస్పీకి నివేదిక పంపినట్లు డిఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సిఐనాగేంద్ర, తలుపుల ఎస్ఐ చెన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# అబ్కారీలో 'మామూలు' మైకం..'అదనపు' పైకం..!

- అదనపు రూపంలో నెలకు రూ. 10 లక్షల దోపిడీ
- అధిక ధరలకు కొమ్ము కాస్తూ..అక్రమాల తప్పులు దాస్తూ..!
- మందుబాబుల గోడు పట్టించుకోని అధికారులు





యాడికిలో రూ. 30 లు అదనంగా వసూలు చేసిన వైనం

**యాడికి(తాడిపత్రి),ఫిబ్రవరి 22,ప్రభాతవార్త:**

మండలంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న గొలుసు దుకాణాల సంగతి దేవుడెరుగు.. మద్యం దుకాణాల్లోని అధిక ధరల జోరును కూడా అబ్కారీ శాఖ నియంత్రించలేకపోతోంది. ఈ అధిక ధరలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారి వివరాలు దుకాణదారులకు అందజేసి వారిపై పరోక్షంగా కక్ష సాధింపు చర్యలకు సహకరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో మద్యం బాబులు లోలోపలే మదన పడుతూ.. అధికారులను విమర్శిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. ఇటీవల ఓ యువకుడు అధిక ధరలపై అబ్కారీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా ఆ మద్యం దుకాణానికి చెందిన వ్యక్తులు బెదిరించడమే గాక ఆ దుకాణంలో అధిక ధరలకు మద్యం విక్రయించడం లేదంటూ సంబంధిత అధికారులు ఆ మద్యం దుకాణంపై వచ్చిన ఆరోపణలు నిరాధారమంటూ కొట్టి పారేయడం విశేషం. అబ్కారీ శాఖ ప్రేక్షక పాత్ర గురించి మండలంలోని ఏ దుకాణానికి వెళ్లిన మద్యం బాబులను అడిగినా చెబుతారు. మద్యం విషయంలో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్, పోలీసు అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటోంది.

ః జనవరి 27న యాడికిలోని మద్యం దుకాణంలో ఓ మందుబాబు మ్యాక్‌డొవెల్స్ నం.1 లగ్జరీ సుప్రీమ్ విస్కీ 375 ఎం.ఎల్.కు రూ.390లు వెచ్చించాల్సి వచ్చింది. ప్రభుత్వం సంక్రాంతి సందర్భంగా రూ. 360 ల నుంచి రూ.370లకు పెంచింది. అయితే ఇక్కడ మరో రూ.20లు అదనంగా చెల్లించాల్సి వచ్చింది. అదేమని అడిగితే అదంతే అనే సమాధానమే ఎదురైంది. తెలిసి తెలిసి ఈ అదనపు రుసుము చెల్లించాలంటే పర్యవేక్షణ పట్టించుకోని అధికారులపై అసహనం వేస్తోందని మందు ప్రేమికులు అభిప్రాయ పడుతున్నారు.

ః జనవరి 16న కొత్తగా మద్యం ధరలకు రెక్కలొచ్చాయని బాధపడుతున్న మందు ప్రేమికులపై దుకాణాల నిర్వాహకులు మరింత భారం మోపేలా రూ.20 లు అదనంగా పెంచేశారు. అదే రోజు ఓ మద్యం ప్రేమికుడు రాయలచెరువులోని మద్యం దుకాణం వద్దకు వెళ్లి మ్యాక్‌డొవెల్స్ నం.1 లగ్జరీ సుప్రీమ్ విస్కీ 375 ఎం.ఎల్. కొనుగోలు చేయగా రూ.370ల స్థానంలో రూ. 390 లు ఇవ్వాల్సిందే అంటూ ముక్కుపిండి వసూలు చేశారు.

ః డిసెంబరు 24, 2025న ఓల్డ్ అడ్మిరల్ ధర పెరగక ముందే రూ. 130 లు ఉన్న దానికి రూ.140 లు చెల్లించాల్సి వచ్చిందని, ప్రస్తుతం ధరలు పెరిగిన తర్వాత రూ. 150 లు వసూలు చేస్తున్నారని ఓ మందుబాబు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ః ఈ నెల 18న ఓ మద్యం ప్రియుడు రాయలచెరువులోని మద్యం దుకాణం వద్దకు వెళ్లి కొరియర్ నెపోలియన్ బ్రాంది తీసుకొని రూ.470లు ఇవ్వచూపాడు. అదేం కుదరదు అంటూ రూ. 500 లు వసూలు చేశారు. ఇదేమని అడిగి గొడవకు దిగితే చిన్నతనంగా ఉంటుందని చెప్పి అతను రూ.500లు ఫోన్‌పే చేసి అక్కడి నుంచి మౌనంగా వెనుదిరిగాడు.

ః అదే రోజు రాయలచెరువుకు గుంతకల్లు నుంచి వచ్చిన కొందరు మద్యం ప్రియులు రూ. 30 లు అదనంగా ఇవ్వాల్సిందేనని దుకాణపు సిబ్బంది ఒత్తిడి చేస్తే వారు మాకు కూడా మద్యం షాపులున్నాయి. ఎక్కడా ఇంత అధికంగా అమ్మడం లేదు. ఇచ్చేది లేదంటూ గొడవకు దిగడంతో వారి ఇచ్చింది తీసుకొని పంపించారు. ఇలా చెప్పుకుంటూ పోతే బాధితుల సంఖ్య చాంతాడును మించి పోతుంది. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

**నెలకు రూ.10 లక్షలకు పైగా దోపిడీ**

యాడికి మండలంలో ఉన్న దుకాణాల్లో ఒక్కో దుకాణం నుంచి సామాన్యులు తాగే మద్యం కనీసం 10 కేసులు విక్రయిస్తుంటారని, ఆ లెక్కన మండల వ్యాప్తంగా ప్రతి రోజూ 40 కేసులు విక్రయిస్తే 1,920 సీసాల నుంచి సుమారు రూ. 20 వేలు అదనంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అంటే నెలకు దాదాపు రూ.6 లక్షలతో పాటు ఇతరత్రా బ్రాండ్ల ధరలను కూడా కలుపుకుంటే ఒక్కో దుకాణం నుంచి ప్రతి నెలా మొత్తం రూ. 10 లక్షలు అదనంగా దోస్తున్నారని మందుబాబులే చెవులు కొరుక్కుంటున్నారు. ఇక గ్లాసులు, వాటర్ ప్యాకెట్స్ రూపంలో మరింత నష్టపోవాల్సి వస్తోందని మద్యం ప్రియులు వాపోతున్నారు. ఇంత దోపిడీ ఎందుకని మందుబాబులు గట్టిగా అడిగితే మేము కూడా అధికారులకు ఒక్కో దుకాణానికి నెలకు రూ.20 వేలు ఇచ్చుకోవాల్సి ఉంటుందని బాహాటంగానే చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. కొందరు అధికారులైతే తాము ముందే తనిఖీలకు వస్తున్నట్లు సమాచారం ఇచ్చి, తూతూ మంత్రపు తనిఖీలు చేసి, ఆ విషయాలను నమోదు చేసి ఉన్నతాధికారులను మభ్యపెడుతున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. జిల్లా స్థాయి అధికారులు పారదర్శకంగా తనిఖీలు చేస్తే పేదల సొమ్ము గద్దల పాలు కాకుండా చూడవచ్చనే వాదనలు జనం నుంచి వినిపిస్తున్నాయి.

# రైతుల ఆత్మహత్యలు ప్రభుత్వాలకు పట్టదా..!

- దేశవ్యాప్తంగా 3 లక్షలకు పైగా రైతులు ఆత్మహత్యలు
- రాగులపాడు నుంచి పిల్ల కాలువల ఏర్పాటుకు నిధులు కేటాయించాలి
- రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సి.రామచంద్రయ్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

**గుంతకల్లు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సి.రామచంద్రయ్య మండిపడ్డారు. సాగునీటి కోసం సిపిఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన సామూహిక దీక్షలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ పార్టీ మండల కార్యదర్శి రాము రాయల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి రామచంద్రయ్య మాట్లాడుతూ భూ సేకరణతో పాటు, పిల్ల కాలువలు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తద్వార నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని చెరువులకు నీళ్లు నింపి రైతులను ఆదుకోవాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. దీంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 3 లక్షల మందికి పైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ రైతులను విస్మరించిందని విమర్శించారు. రాయలసీమకు కృష్ణా జలాలు మళ్లించాలని కోరారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వల్లే హంద్రీనీవా, తెలుగు గంగా ప్రాజెక్టులు వచ్చాయని గుర్తు చేశారు. వీటివల్ల అత్యంత వెనుకబడిన కర్నూలు, అనంతపురం జిల్లాల రైతులు బాగుపడ్డారన్నారు. ఆదివారం 3వ రోజుకు చేరిన సామూహిక దీక్షలో నెలగొండ గ్రామ రైతులు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ అభివృద్ధి చేస్తుంటే కాంగ్రెస్ వారు దేశ ప్రతిష్టను దిగజార్చేవిధంగా చేస్తున్నారు

-బిజెపి రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పివి ప్రతాప్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

ప్రధాని నరేంద్రమోడీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం కోసం అహర్నిశలు కృషి చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీతో పాటు పార్టీ నాయకులు దేశ విద్రోహ చర్యలకు పాల్పడుతూ దేశ ప్రతిష్టను దిగజార్చే విధంగా ప్రవర్తిస్తున్నారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పివి ప్రతాప్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆదిశేషలు పేర్కొన్నారు. స్థానిక నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భారతదేశం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు అర్ధనగ్నంగా ప్రదర్శనలు చేస్తూ, రాజకీయ పోస్టర్లు ప్రదర్శించి నిరసన తెల్పడం వంటి చర్యలు ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు జరిగిన ముందస్తు కుట్ర అన్నారు. మొన్న ఢిల్లీలో జరిగిన ఏఐ సదస్సులో దాదాపు 100 దేశాల ప్రతినిధులు, 20 మంది దేశాధినేతలు, వేలాది మంది గ్లోబల్ సిఇఒలు సదస్సులో ఉండగా కాంగ్రెస్ నాయకులు దొంగ ఐడిలు క్రియేట్ చేసుకుని సదస్సులోపలికి ప్రవేశించి అర్ధ నగ్న ప్రదర్శన చేయడం చాలా దుర్మార్గమైన చర్యగా భావిస్తున్నామన్నారు. ప్రపంచం భారతదేశాన్ని ప్రశంసిస్తుంటే కాంగ్రెస్ మాత్రం దేశ ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తోందన్నారు. గతంలో కూడా జి20 సదస్సును, అలాగే భారత సైన్యం చేపట్టిన సర్జికల్ స్ట్రైక్స్‌ను కాంగ్రెస్ ప్రశ్నించిన తీరు దేశ ప్రజలకు ఇంకా గుర్తుందన్నారు. మోదీ ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుంటే రాహుల్‌గాంధీ మాత్రం దేశ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నాడని ఇలాగే చేస్తే భవిష్యత్తులో ఉన్న రెండు రాష్ట్రాల్లో కూడా అధికారం కోల్పోయి ప్రజల చేత ఛీకొట్టించుకునే స్థాయికి దిగజారి పోతారని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మైదుకూరు ఆంజనేయులు, భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు చెన్నా రంగనాయకులు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఓబిరెడ్డి, మైనార్టీ మోర్చా జిల్లా కార్యదర్శి జమాల్‌వలి, పట్టణ యువ మోర్చా అధ్యక్షుడు మధు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్‌రెడ్డి అసత్య ఆరోపణలు

- ప్రజలు బుద్ధి చెప్పినా తీరుమారని వైసిపి విమర్శలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు, జనసేన పార్టీ అధ్యక్షుడు టి.సి.వరుణ్ తదితరులు

**అనంతపురం ఫిబ్రవరి22 ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైసిపి నేత జగన్ మోహన్ రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని, 22 సీట్లకు పరిమితం చేసే విధంగా ప్రజలు బుద్ధి చెప్పినా ఆ పార్టీ నాయకుల తీరుమారలేదని టిడిపి జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు విమర్శించారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయనతో పాటు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టి.సి.వరుణ్, బిజెపి జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదరి శ్రీధర్ చౌదరితో పాటు పలువురు కూటమి నాయకులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి నాయకులు కల్తీనెయ్యి కప్పిపుచ్చుకోవడానికి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని, భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వుండడం వల్లే వారికి ఈ గతి పట్టిందన్నారు. జగన్ మోహన్‌రెడ్డికి ధైర్యం వుంటే అసెంబ్లీకి రావాలని, ఆయన రాకుండా వారి సభ్యులతో సభలో వికృతంగా వ్యవహరించి సభా మర్యాదలు మంటగలిపేలా చేస్తున్నారని వారు విమర్శించారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా కార్యదర్శి తాజుద్దీన్, ఉపాధ్యక్షుడు కృష్ణకుమార్, మీడియా కోఆర్డినేటర్ కుమారస్వామి నాయుడు, మాజీ గ్రంథాలయ చైర్మ్ గౌస్ మోహిద్దీన్, జనసేన నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ ఇమామ్ హుసేన్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ ఈశ్వర్, కుమ్మరి కార్పొరేషన్ డైరెక్టర్ నాగేంద్ర కుమార్, మార్కెట్ యార్డు డైరెక్టర్ విజయ్ తదతరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

- జిల్లా ఎస్పీ పి.జగదీష్



జిల్లా ఎస్పీ పి, జగదీష్

**అనంతపురం కలెక్టరేట్ ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

జిల్లాలో నేటి నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు అన్ని విధాలుగా సమగ్ర భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ శ్ పి. జగదీష్, తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా మరియు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేలా తగు బందోబస్తు ఏర్పాట్లు చేయబడినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 64 పరీక్షా కేంద్రాల వద్ద సివిల్ మరియు యూనిఫాం పోలీసు సిబ్బందిని మోహరించారు. ప్రతి కేంద్రం వద్ద సీసీ కెమెరాలు, నిరంతర నిఘా మరియు రౌండింగ్ పార్టీలు ఏర్పాటు చేయబడినవి. ముఖ్యంగా పరీక్షల సమయంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా కేంద్రాల పరిసర ప్రాంతాలను "సైలెంట్ జోన్"గా ప్రకటించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో సెక్షన్ 144 అమల్లో ఉంటుంది. నలుగురికి పైగా గుంపులుగా గుమి కూడటం, అనుమానాస్పదంగా తిరగడం నిషేధించబడింది. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినట్లయితే కఠిన చర్యలు తీసుకోబ డతాయి అన్నారు. పరీక్షలకు సంబంధించిన తప్పుడు ప్రచారం, ప్రశ్నాపత్రాల లీక్ వంటి అసత్య సమాచారాన్ని సోషల్ మీడియా వేదికల ద్వారా వ్యాప్తి చేసిన వారిపై ఐటీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎలాంటి పుకార్లను నమ్మవద్దని, అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని సూచించారు. పరీక్షా కేంద్రానికి కనీసం ఒక గంట ముందుగా చేరుకోవాలి. హాల్ టికెట్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలి. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు పరీక్షా హాల్‌లోకి తీసుకురావద్దు. తఅందిన ప్రశ్నాపత్రం తాను రాయబోయే సబ్జెక్టుకే సంబంధించినదో లేదో పరిశీలించుకోవాలి. పరీక్షా సమయాల్లో విద్యార్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. కేంద్రాల సమీపంలో అధిక శబ్దం కలిగించే కార్యక్రమాలు, డీజేలు, ఊరేగింపులు నిర్వహించరాదని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్, ప్రజలు, విద్యాసంస్థల యాజమాన్యాలు, తల్లిదండ్రులు పోలీసు శాఖకు సహకరించి పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు.


పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వ అండదండలు 4 >>


అస్తవ్యస్తంగా కూతలేరు వంక పట్టించుకోని ఉన్నతాధికారులు


# అనంతలో అరటి రేట్లు పెరుగుతున్నాయోచ్..!

- ఈ ధరలు ఎన్నాలుంటాయోనని రైతుల్లో టెన్షన్ - ఈ ఏడాది బాగా నష్టపోయిన రైతులు

**అనంతపురం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త బ్యూరో**

అరిటి పంట ధరలు ఇప్పుడిప్పుడే పెరుగుతుండటంతో అరటి రైతుల్లో ఆశలు చెలరేగుతున్నాయి. ఇన్నాళ్లూ ఈ ఏడాది భారీగా అరటి రేట్లు పడిపోవడం తో రైతులు భాగా నష్టపోయారు. అనంతపురం జిల్లా రైతు లు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారు. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా అరిటి కాయల ధర పెరుగుతుండటంతో అనంత రైతుల్లో ఆశలు కలుగుతున్నాయి. అరటి టన్ను 19వేల నుంచి 23 వేల వరకు నడుస్తోంది. సగటున 21వేల వరకు ధర పలుకుతోందని తెలుస్తోంది. అయితే ఈ అరటి ధరలు ఎన్నాళ్లు ఉంటాయో అన్నది రైతుల్లో టెన్షన్ ఉంది. అనంతపురం జిల్లాలో అరటి సాగు ఎక్కువ. శ్రీ సత్యసాయి జిల్లాలో అరటి సాగు తక్కువగా ఉంది. అనంతపురం జిల్లాలో దాదాపు 39,952 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం తదితర నియోజక వర్గాల్లో పెద్ద ఎత్తున అరటి సాగు చేస్తున్నారు. అరిటి సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.



అందువల్లే సాగు విస్తీర్ణం పెరుగుతూ వచ్చింది. శ్రీ సత్యసాయి జిల్లాలో 4,250 ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నారు. శ్రీ సత్యసా యి జిల్లాలో ముఖ్యంగా ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో ఎక్కువగా ఉంది. సత్యసాయి జిల్లాలో అరటి సాగు విస్తీర్ణం తక్కువే అని చెప్పవచ్చు. ప్రతి యేటా ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెద్ద ఎత్తున అరటి సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. పెట్టుబడి ఎక్కువగా ఉన్నప్పటికీ ధర ఉంటే ఎక్కువ డబ్బులు వస్తాయన్న ఆశతో రైతులు అరటి సాగుకు ముందుకు వస్తున్నారు. పుట్లూరు, యల్లనూరు ప్రాంతాల్లో ఎకర 30 నుంచి 35వేల వరకు గుత్త ఇచ్చి కూడా అరటి సాగు చేసేందుకు రైతులు యత్నిస్తు న్నారు. అయితే గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో అరటి దిగుబడి ఎక్కువగా వచ్చినప్పుడు రేట్లు భారీగా పడిపోవడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతులు ఎక్కువగా నష్టపోయారు. ఢిల్లీలో చలి ఎక్కువగా ఉండటం, వ్యాపారస్తులు రాకపోవడం తదితర కారణాల వల్ల డిసెంబర్ 2, 3 తేదీల్లో టన్ను అరటి మొదటి రకం 8వేలు నడిచింది. 2, 3, 4 రకాలు టన్ను 2వేల నుంచి 5వేల వరకు నడిచా యి. ఈ పరిస్థితుల్లో అన్నదాతలు రోడ్లు ఎక్కారు. అరటి తోటలను దున్నే యడం కూడా చేశారు. అరటి రైతులను ఆదుకోవాలని వైసిపి, సిపిఐ, సిపిఎం పార్టీలు ఇతర రైతు సంఘాల నాయకులు ఒకవైపు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆందోళన చేస్తూ పంట పొలాలను పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పేందుకు యత్నించారు. రైతు సంఘాలు జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులపై ఒత్తిడి తేవడంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా చివరకు స్పందించి అరటి కొనుగోలుకు సంబంధించి దాదాపు 30 కంపెనీల వారిని పిలిపించి చర్చలు జరిపింది. ఆ చర్చల ఫలితంగా కొన్ని కంపెనీలు ముందుకు వచ్చి అరటి కొనుగోళ్లకు రంగంలోకి దిగాయి. ఈ నేపథ్యంలో స్వల్పంగా అరటి ధరలు పెరుగుతూ వచ్చాయి. నవంబర్, డిసెంబర్ నెలలో అరటి రైతుల నష్టాలను ఎవరు పూడ్చ లేనివి, పెట్టుబడులు కూడా చేతికి రాక అప్పులు ఊబిలోకి కూరుకుపోయారు. అరటి రైతులనను ఆదుకుంటా మని చెబు తున్నప్పటికీ నష్ట పరిహారం చెల్లించే విషయంలో రైతులకు న్యాయం జరగ డం లేదు. ఈ విషయంలో అరటి రైతులను ఆదుకునేందుకు ఇప్పటికైనా వివిధ రూపాల్లో ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రైతు సంఘాలు కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అరటి ధరలు పెరగడం తో అన్నదాతల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం కొనసాగుతున్న అరటి ధరలు మరింత పెరిగితే కష్టాల నుంచి బయట పడవచ్చని, ఇందుకు అవసరమైన అన్ని చర్యలను రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత అధికారులు తీసుకోవాలని అరటి రైతులు కోరుతునా న్నరు.

## ఆర్యవైశ్య కులస్తులకు అండగా కూటమి ప్రభుత్వం

- రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దుండి రాకేష్.



మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దుండి రాకేష్

**మడకశిర టౌన్ ఫిబ్రవరి 22 ప్రభాతవార్త.**

రాష్ట్రంలో ఆర్యవైశ్య కులస్తులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటూ వారికోసం ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దుండి రాకేష్ తెలిపారు. మడకశిర పట్టణం ఆదివారం బాలాజీ నగర్ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ను రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దుండి రాకేష్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. నియోజకవర్గంలో ఉన్న ఆర్యవైశ్యుల వారి స్థితిగతుల గురించి చర్చించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దుండి రాకేష్ మాట్లాడుతూ:కూటమి ప్రభుత్వంలో వాణిజ్యపరంగా వర్తకులకు సులభతరంగా సంస్కరణలు ప్రవేశపెట్టిందని ఆర్థికంగా రాజకీయంగా రాష్ట్రంలో ఉన్నటువంటి ఆర్యవైశ్య కులస్తులను బలోపేతం చేయడం కోసం కూటమి ప్రభుత్వం తరపున ఎంతగానో కృషి చేస్తామన్నారు , రాబోవు రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు మద్దతుగా నిలవాలని అభివృద్ధికై పట్టం కట్టే విధంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ నాగరాజు.ఆర్యవైశ్య నాయకులు కట్టా కిషోర్.ఆది. రమేష్. ప్రణీత్. బాబు. తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మారెమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



మారెమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు సతీమణి ఉమాదేవి.

**మడకశిర టౌన్ ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

మడకశిర మండల పరిధిలోని కల్లుమరి గ్రామంలో మారెమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు, టిటిడి బోర్డ్ మెంబర్,ఎమ్మెల్యే రాజు సతీమణి ఉమాదేవి పాల్గొని అమ్మవారికి వివిధ రకాల పూలతో ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా హోమం నిర్వహించి అర్చకుల సమక్షంలో కుంకుమ పూజ అమ్మవారికి కలశం నెత్తి మీద పెట్టుకొని అమ్మవారికి సమర్పించారు. ఎమ్మెల్యే రాజు సతీమణి ఉమాదేవి తో పాటు మహిళలు జ్యోతులు కలశాలు ఊరేగింపుగా తీసుకొని వెళ్లి అమ్మవారికి సమర్పించారు. గ్రామ పెద్దలు, భక్తులు, మహిళలు వందలాది మంది పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు సతీమణి ఉమాదేవి మాట్లాడుతూ: గ్రామ సమైక్యత కోసం గ్రామ దేవత మారెమ్మ అమ్మవారి విగ్రహం ఏర్పాటు ఎంతో సహకరిస్తుందన్నారు. నియోజకవర్గంలో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని అమ్మవారికి కోరుకుంటున్నామన్నారు. ప్రజల శ్రేయస్సు మాకు ముఖ్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ. మండల కన్వీనర్ నాగరాజు, సింగల్ విండో అధ్యక్షులు నరేష్ కన్నా.మాజీ సర్పంచ్ చంద్రప్ప. టిడిపి నాయకులు. గ్రామ పెద్దలు. ప్రజలు. మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న జనసైనికులు



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న జనసైనికులు

**రొళ్ల ఫిబ్రవరి22(ప్రభాతవార్త)**

జనసేన పార్టీ జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యులు నాగరాజ్ వివాహం కర్ణాటక గొరవనహళ్లి మహాలక్ష్మి పుణ్యక్షేత్రంలో ఆదివారం జరిగింది.వధూవరుల పిలుపు మేరకు మడకశిర నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త రొళ్ల మండల అధ్యక్షుడు రంగస్వామి, మడకశిర మండల అధ్యక్షుడు శివాజీ, టౌన్ ఉపాధ్యక్షులు పవన్ కళ్యాణ్,మారుతి,వైబిహళ్లి పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. ఈ మేరకు నూతన నవ వధూవరులను అక్షింతలేసి ఆశీర్వదించారు.

## రొళ్లలో స్వామివారి ఊరేగింపు



ట్రాక్టర్ పై స్వామి వారిని ఊరేగిస్తున్న దృశ్యం

**రొళ్ల ఫిబ్రవరి22, (ప్రభాతవార్త)**

మండలంలోని హులీకుంట గ్రామంలో త్వరలో ప్రతిష్ఠించనున్న రంగనాథస్వామి,శ్రీ ఆంజనేయ స్వామి మూల విగ్రహాల ఊరేగింపును చేపట్టారు.రొళ్ల పట్టణంలో ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి హులికుంట గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో విగ్రహాలను ట్రాక్టర్ పై ఉంచి పట్టణం అంతటా ఊరేగించారు.భక్తులు అడుగడుగునా స్వామివార్లకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో న్యాయవాది రంగనాథ్ మరియు స్థానికులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం

**కొత్తచెరువు ఫిబ్రవరి 22 ప్రభాతవార్త.**

శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నేటి నుంచి సోమ వారం నుండి ప్రారంభమై మార్చి నెల 24 తేదీన పూర్తి అవుతాయని డి ఐ ఈ ఓ చెన్నకేశవ ప్రసాద్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాలకు సంబంధించిన 113 కళాశాలల నుండి 23852 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 42 పరీక్షా కేంద్రాల యందు పరీక్షలు జరుగనున్నాయి. ప్రథమ సంవత్సరం లో 6197 మంది బాలికలు,5540 మంది బాలురు అనగా మొత్తం 11737 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం లో 6260 మంది బాలికలు, 5855 మంది బాలురు అనగా మొత్తం 12115 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారు. అన్ని పరీక్షా కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం అయినది. త్రాగునీరు, టాయిలెట్ సౌకర్యాలు కల్పించ బడ్డాయి. ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, నలుగురుసిట్టింగ్ స్క్వాడ్ లు ఏర్పాటు ఏర్పాటు చేయడమైనది. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి.జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రామరాజు, ప్రశాంతి, ప్రశాంత్ మరియు డిస్ట్రిక్ట్ బల్క్ నోడల్ ఆఫీసర్ భీముడు నాయక్ ఈ పరీక్షలను పర్యవేక్షిస్తున్నారు.

## ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి వైకాపా రచ్చబండ కార్యక్రమం

- నియోజకవర్గ వైకాపా ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివన్న



మాట్లాడుతున్న ఎస్సి సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు

**అమరాపురం ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

మండల పరిధిలో శివరం గ్రామపంచాయతీ పరిధిలో కే శివరం గ్రామం లోని కరియమ్మ దేవాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక పంచాయతీ వైకాపా కన్వీనర్ ఏసన్న అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ స్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కారం కోసం ప్రభుత్వానికి డిమాండ్ చేయడమే రచ్చబండ కార్యక్రమం ఉద్దేశం అన్ని మడకశిర నియోజక వర్గం వైకాపా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఉప్పార్లపల్లి శివన్న తెలిపారు. వైకాపా సీనియర్ నాయకులు పేలుబండ ప్రసాద్, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి తది తరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మాట్లాడుతూ లక్ష్యంగా కృషి చేయాలని స్థానిక నాయకులను విన్నవించారు. స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకోవడానికి రచ్చబండ కార్యక్రమాన్ని వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. స్థానిక నాయకులు వీరభద్రప్ప, మారప్ప ,రంగస్వామి, స్థానిక వైకాపా నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పట్టు రైతుల సమ్మేళనం




ఉత్తమ పట్టు రైతు చిదానందను సన్మానిస్తున్న దృశ్యం

**అగళి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

కేంద్ర పట్టు మండలి, ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం పట్టు పరిశ్రమ శాఖ వారి ఆధ్వర్యంలో పట్టు రైతుల సమ్మేళనం పెనుకొండలో నిర్వహించారు. అగళి మండలం నుంచి కూడా పట్టు రైతులు చిదానంద, గోపి, శివకుమార్, పదుల సంఖ్యలో రైతులు హాజరయ్యారు. ఈ సమ్మేళనంలో సైంటిస్టులు హాజరై ప్రసంగించారు. ముఖ్యంగా కొత్తరకం పట్టు వంగడాలు, కొత్తరకం పట్టు పురుగుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. వీటిని ఎలా పెంచి పోషించాలి, వాటికి మేతను ఎలా వాడాలి, వాటి సంరక్షణ గురించి వివరించారు. అగళికి చెందిన చిదానంద అనే ఉత్తమ పట్టు రైతును ముకడాంపల్లికి చెందిన ఉత్తమ పట్టు రైతు గోపిని అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమశాఖ డైరెక్టర్ దీపిక రాష్ట్ర డైరెక్టర్ అరుణకుమారి, సైంటిస్ట్ సీతరాములు, లక్ష్మి, సెరికల్చర్ ఏడి హనుమంతరాయనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కొరకే జగనన్నకు చెబుదాం, రచ్చబండ కార్యక్రమాలు



జుం మీటింగ్ ద్వారా పార్టీ అభివృద్ధి ప్రజా సమస్యలపై చర్చిస్తున్న దృశ్యం

**రొళ్ల ఫిబ్రవరి22(ప్రభాతవార్త)**

మండలంలోని పిల్లిగుండ్ల గ్రామం ఎల్లమ్మదేవి ఆలయం ఆవరణలో ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం,రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాలూకా పరిశీలకుడు రఘునాథరెడ్డి, మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప, రాష్ట్ర యాక్టీవీటి ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు వజ్ర భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఇందులో భాగంగా ప్రొజెక్టర్ ద్వారా జూమ్ మీటింగ్ నిర్వహించి గ్రామంలోని సమస్యలు పార్టీ అభివృద్ధికి తీసుకోవలసిన కార్యకలాపాలపై సుదీర్ఘంగా చర్చించారు. వారు మాట్లాడుతూ ..ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహారెడ్డి, నాయకులు నాగేంద్ర తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాసనకోటలో కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమం



కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు

**పరిగి ఫిబ్రవరి 22(ప్రభాత వార్త):**

శ్రీసత్యసాయిజిల్లా వైస్సార్సీపీ జిల్లాఅధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్, పరిగి మండల కేంద్రంలోని శాసనకోట పంచాయితీ శాసనకోట గ్రామం నందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి గడపగడపకు వెళ్లి ప్రతి ఒక్కరిని పలకరిస్తూ, నాడు జగనన్న ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రజలకు ఏ లోటు లేకుండా ప్రతి కుటుంబానికి ప్రతి ఏడాది సంక్షేమ పథకాలు అందించామని గుర్తు చేశారు, ఇప్పుడున్న ఈ కూటమి ప్రభుత్వం ప్రజలకు మాయమాటలు చెప్పి మభ్య పెట్టే విధంగా లేనిపోని హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత ప్రజలను తీవ్రంగా అన్యాయం చేశారని ప్రతి ఒక్కరికి వివరించిన మాజీ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ ఈ కార్యక్రమంలో పరిగి మండల ప్రజా ప్రతినిధులు, మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు మరియు శాసనకోట గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 9 మంది పేకాట రాయుళ్లు అరెస్ట్

**కంబదూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

కంబదూరు మండలంలోని వైసిపల్లి గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఎస్సై లోకేశ్ కథనం ప్రకారం రాబడిన సమాచారం మేరకు పేకాట స్థావరాలపై సిబ్బందితో కలిసి దాడి చేసి 9 మంది పేకాట రాయుళ్ల ను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 22,600 నగదు, 5 మొబైల్ ఫోన్లు, 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లోకేష్ మీడియాకు తెలిపారు. ఒకరు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## ఆర్యవైశ్య భవనాన్ని ప్రారంభించిన ఎంఎల్ఏ సతీమణి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

**గుడిబండ ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కాంప్లెక్స్ భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సతీమణి ఉమాదేవి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దుండి రాకేష్,పుట్టపర్తి ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కోటాసత్యం పాల్గొని భవనాల ప్రారంభోత్సవం నిర్వహించి,జ్యోతి ప్రజ్వలన చేశారు.అనంతరం గుడిబండ ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఎమ్మెల్యే సతీమణి ఉమాదేవిని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దుండి రాకేష్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప టిడిపి మండల అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప,స్థానిక సర్పంచ్ కరుణాకర్ గౌడ్,ఎంపీటీసీ వనజాశేఖర్, మండలంలోని ఆర్య వైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కంటిచూపు పట్ల జాగ్రత్తలు వహించండి

**ధర్మవరం,ఫిబ్రవరి22,ప్రభాతవార్త**

పతి ఒక్కరు కంటిపట్ల జాగ్రత్త వహించాలని కిమ్స్ సవేరా ఆస్పత్రి డాక్టర్ పూజారిజాహ్నవి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. దాత బండి వేణుగోపాల్ సహకారంతో ఈ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 65మందికి కంటి వైద్యనిపుణులు పరీక్షలు నిర్వహించగా 45 మందిని శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు రమేశ్బాబు, కార్యదర్శి నాగేంద్ర, క్లబ్ వ్యవస్థాపకులు వెంకటస్వామి,సభ్యులు గోసేరాధాక్రిష్ణ, మోహన్దాసు, పుట్లూరు నరసింహులు, డాక్టర్ లక్షీనారాయణన్, వెంకటేశకుమార్ పాల్గొన్నారు.

## మండల సర్వసభ్య సమావేశం నేటికీ వాయిదా



సమావేశము సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఎంపీడీవో

**అనంతపురం రూరల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలం పరిషత్ కార్యాలయంలో ఆదివారం మండల అధ్యక్షురాలు ఆధ్వర్యంలో ఎంపీడీవో నిర్వహించిన సర్వసభ్య సమావేశం కో రంలేక ఈనెల 23 సోమవారానికి వాయిదా వేసినట్లు ఎంపీడీవో దివాకర్ తెలియజేశారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు కోరం కోసం అధికారులు వేచి చూసి కోరం కాకపోవడంతో ఎంపీడీవో ఈ సర్వసభ్య సమావేశం స్వామి వారికి వాయిదా వేస్తున్నట్లు సభ్యులకు మండల అధికారులకు తెలియజేశారు. సోమవారం జరిగే సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

## పేకాటపై మెరుపుదాడులు

**9 మంది అరెస్ట్ - రూ.44,250 నగదు, వాహనాలు స్వాధీనం**

**పుట్టపర్తి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

నేరాలకు పాల్పడుతూ బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని పుట్టపర్తి రూరల్ సీఐ సురేష్ హెచ్చరించారు.శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు పుట్టపర్తి రూరల్ పరిధిలోని గంగిరెడ్డిపల్లి సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందడంతో శనివారం పోలీసులు మెరుపుదాడులు నిర్వహించారు. గూలూరు ఆంజనేయులు పొలం సమీపంలో పేకాట జూదకేంద్రం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.సీఐ సురేష్ సూచనలతో ఏఎస్ఐ ప్రసాద్ తమ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించి పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేశారు. ఘటన స్థలం నుండి రూ.44,250 నగదు, 8 మొబైల్ ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేశారు.గంగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సురేష్ గతంలోనే నేరాలకు పాల్పడినందుకు తహసీల్దార్ ఎదుట లక్ష రూపాయల పూచీకత్తు బాండ్‌తో బైండోవర్ చేసినట్లు సీఐ వెల్లడించారు. అయితే బైండోవర్ కాలంలోనే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం వల్ల నిబంధనల ఉల్లంఘన కింద లక్ష రూపాయలు వసూలు చేయడం లేదా ఆరు నెలలు న్యాయ పరిరక్షణలో (జుడీషియల్ రిమాండ్) పంపే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.పుట్టపర్తి రూరల్ పరిధిలో ఎక్కడైనా పేకాట, మట్కా, అక్రమ మద్యం వంటి కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పాలవాయిలో పీఎండీఎస్ విధానంలో ఉచిత మాన్సూన్ డ్రై సోయింగ్

- ప్రకృతి వ్యవసాయంతో ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుంది



ప్రకృతి వ్యవసాయంలో డ్రై సోయింగ్ పరికరాలు ఉపయోగిస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మా నాయక్ ఆదేశాల మేరకు, కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలోని కళ్యాణదుర్గం మండలం పాలవాయి యూనిట్, మల్లాపురం గ్రామంలో రైతు లీలావతి పొలంలో పీఎండీఎస్ ఉచిత మాన్సూన్ డ్రై సోయింగ్ కార్యక్రమంను విజయవంతంగా నిర్వహించారు. రుతుపవనాలు ప్రారంభమయ్యే ముందుగానే విత్తనాలు విత్తే విధానంలో, ఆముదం, అను ములు, కందులు, సజ్జలు, గోరుచిక్కుడు, అలసందలు, పత్తి విత్తనాలతో పాటు 5 శాతం బయోడైవర్సిటీ కోసం 20 రకాల విత్తనాలను వినియోగించారు. ఈ విత్తనాలకు బీజామృతం, ఘనజీవా మృతం, బంక మట్టి, బూడిద, తగినంత నీటిని కలిపి విత్తన గుళికలు తయారు చేసి, ఘనజీవామృతం పొడిలో కలిపి లైన్ సోయింగ్ పద్ధతిలో విత్తడం జరిగింది. ఈ విధానం వల్ల వర్షాలు ఆలస్యంగా వచ్చినా లేదా తక్కువ వర్షపాతం ఉన్నా నేలలో తేమ నిలిచి ఉంటుంది. వర్షం కురిసిన వెంటనే విత్తన మొలక శాతం మెరుగ్గా ఉండి, నేల సారవంతం పెరగడంతో పాటు భూమిలో కార్బన్ శాతం కూడా గణనీయంగా పెరుగుతుంది. దీని ఫలితంగా ప్రధాన పంటల దిగుబడి మరింత పెరుగుతుందని నిపుణులు వివరించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరించడం ద్వారా వ్యవసాయ ఖర్చులు తగ్గి, నేల ఆరోగ్యం మెరుగుపడి, రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో లీలావతి, శివశంకర్, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు ప్రమీలమ్మ, ఓబులేసు, నారాయణ,అంజినమ్మ, అరుణమ్మ, రామాంజినేయులు, మారెక్క పాల్గొన్నారు.

## జిల్లా కోర్టు కాంప్లెక్స్ కోసం స్థలం కేటాయిస్తూ రెండు రోజులలో నివేదిక పంపండి

- పుట్టపర్తి ఆర్డీవోను ఆదేశించిన జిల్లా జడ్జ భీమరావు



స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా జడ్జి

**పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 22, ప్రభాత వార్త**

సత్యసాయి జిల్లా లో జిల్లా కోర్టు కాంప్లెక్ సామూహిక భవన నిర్మాణాల నిమిత్తం అవసరమైన స్థలమును సత్వరమే కేటాయిస్తూ రెండు రోజుల్లో నివేదిక పంపాలని జిల్లా జడ్జి భీమరావు పుట్టపర్తి ఆర్ డి ఓ సువర్ణ ను ఆదేశించారు. ఆదివారం మధ్యాహ్నం పుట్టపర్తి బార్ కు చెందిన న్యాయవాదులు,జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్, పుట్టపర్తి రెవెన్యూ డివిజనల్ అధికారి సువర్ణ సిబ్బందితో కలసి జిల్లా కోర్టు సామూహిక భవనముల కొరకు అనువైన స్థలం కోసం పరిశీలన చేశారు. బీడిపల్లి రహదారిలో హైస్కూల్ కు సమీప స్థలాన్ని మరియు విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలోని భూములను పరిశీలనచేసిన సంతృప్తి వ్యక్తంచేసిన జిల్లా జడ్జి రెండుచోట్ల కలిపి 11ఎకరముల భూమి అవసరమని ఖరారు చేశారు. ఒకే చోట సదరు విస్తీర్ణం లభ్యం కాని సందర్భంలో ఒక చోట కోర్టు కాంప్లెక్స్ మరో చోట జడ్జి వసతి గృహాల నిర్మాణానికి అనువుగా ఉంటుందన్నారు. అనంతరం ఆర్డీఓ సువర్ణ తో రెండు ప్రాంతాల్లోనూ 11ఎకరముల మేర స్థలం కేటాయిస్తూ రెండు రోజుల్లో తుది నివేదిక పంపాలని ఆదేశించారు. పుట్టపర్తి లో జిల్లా కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం కోసం ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. కావున రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక చొరవచూపి స్థల కేటాయిస్తూ తక్షణం నివేదిక ఇవ్వాలని కోరారు.ఈ సందర్భంగా జిల్లా జడ్జి భీమారావును పుట్టపర్తి బార్ న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్,ఆర్డీఓ సువర్ణ, పుట్టపర్తి బార్ న్యాయవాదుల అథావుర్ రహమాన్ లెక్కల యధుభూషణ్, చల్లా చంద్రశేఖర్, లెక్కల కృష్ణ ప్రసాద్, శ్రీనివాస్, కిరణ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి

**కనగానపల్లి ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

ధర్మవరం పట్టణంలో శిరిడి సాయిబాబా కళ్యాణమండపంలో ఆదివారం మండల కేంద్రానికి చెందిన పూజారి సుబ్బరాయుడు, లింగమ్మ ల కుమారుడు ప్రసాదు కోడలు మనీషా వివాహ వేడుకల్లో హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి లు వేరు వేరు సమయాల్లో పాల్గొని నూతన వధూవరులను వారు ఆశీర్వదించారు. వీరి వెంట వైసీపీ నాయకులు సింగల్ విండో మాజీ ప్రెసిడెంట్ వలగొండ భాస్కర్, గంగుల సుధీర్ రెడ్డి, నసనకోట ముత్యాలు, మాజీ డీలర్ గవ్వల మల్లికార్జున రమేశ్,ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

## కదుతులున్న రైల్లో మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ...!

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు...!

**ధర్మవరం,ఫిబ్రవరి 22,ప్రభాతవార్త**

కదులుతున్న రైల్లో ఓ మహిళ మెడలో 3 తులాల తాళిబొట్టు గొలుసు చోరీ జరిగింది. బాధితురాలు శారద రైల్వే జీఆర్పీ పోలీసులకు ఇచ్చిన పిర్యాదు మేరకు... తాను ధర్మవరంలోని ఇందిరానగర్ లో నివాసముంటున్నానని, తాను తన కుటుంబసభ్యులతోపాటు తన బావ కుటుంబసభ్యులు అంతా యాదగిరికి వెళ్లడానికి ధర్మవరం రైల్వే స్టేషన్లో శనివారం రాత్రి 1145 లాతూరో ఎక్స్‌ప్రెస్ రైలుఎక్కి ఎవరి బోగీలలో వారు కుర్చున్నామని , అయితే రైలు 1250గంటలకు అనంతపురం కల్లూరి మధ్యకు చేరుకోగానే నా వెనుక వైపు ఉన్న ఓ దొంగ నా మెడలో ఉన్న 3తులాల బంగారు తాళిబొట్టు లాక్కోని పరారయ్యాడని.గట్టిగా కేకలు వేయడంతో మా బంధువులు లేచి చూడగా అప్పటికే ఆ దొంగ కదులుతున్న రైలు నుంచి దూకి పరారయ్యాడని. ఆమెతో పాటు కుటుంబసభ్యులు అందరూ తిరిగి ధర్మవరంకు చేరుకుని జీఆర్పీ పోలీసులకు పిర్యాదు చేయడం జరిగిందని. రైల్వే జీ ఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

## ఘనంగా ముగిసిన దాగులూరు పోతులయ్య స్వామి జాతర

**కనగానపల్లి ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

మండల పరిధిలోని దాదులూరు గ్రామంలో దాదులూరు పోతులయ్య స్వామి జాతర చివరి రోజైన ఆదివారం పోతులయ్య స్వామి గావుల మహోత్సవం తెల్లవారుజామున పోతురాజుకు స్వామి ఆవహించి మేకపోతు గొంతు కోరికి ఆ రక్తం తాగడం జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ సన్నివేశాన్ని తిలకించారు. అనంతరం స్వామివారికి వేలాది పొట్టేలు, కోళ్లు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పోతులయ్య స్వామి, బంగారు లింగమయ్య స్వామి, చెన్నకేశవ స్వామి లకు టెంకాయలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో పిల్లలకు ఆట బొమ్మలు, మహిళలు గాజులు కొనుగోలు తో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది.

## లాభాల దిశగా గుత్తి టౌన్‌బ్యాంక్

- బ్యాంక్ చైర్మన్ అబ్దుల్‌జిలాన్



బ్యాంక్ చైర్మన్ మాట్లాడుతున్న దృశ్యం

**గుత్తి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

గుత్తి పట్టణంలోని కోఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ ఖాతాదారులు, సిబ్బంది సమన్వయంతో లాభాల దిశగా పయనిస్తోందని బ్యాంకు చైర్మన్ అబ్దుల్‌జిలాన్ పేర్కొన్నారు. స్థానిక వసుధా ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం బ్యాంకు 103వ సర్వ జన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులో 4533 మంది సభ్యులు ఉన్నారన్నారు. 134 కోట్ల రూపాయల డిపాజిట్లు కలిగి ఉన్నాయని, ఖాతాదారులకు దాదాపు 100 కోట్ల రూపాయల మేర రుణాలు ఇచ్చామన్నారు. బ్యాంకు నికరంగా 3.60 కోట్ల రూపాయల మేర లాభం ఆర్జించిందన్నారు. కాగా శ్రీనివాసులు అనే ఖాతాదారుడు మాట్లాడుతూ తన గృహానికి సంబంధించిన బ్యాంక్ రుణం వ్యవహారంలో మార్కెట్ ధర కంటే తక్కువకు బహిరంగ వేలం నిర్వహించారని ఆరోపించారు. అయితే సబ్ రిజిస్ట్రార్ ఇచ్చిన సదరు గృహం విలువ మేరకు, ఆర్‌బిఐ నిబంధనల మేరకు తాము వ్యవహరించామన్నారు.ఈ మేరకు ఆయన సంబంధిత పత్రాలను సమావేశంలో చైర్మన్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ షరీఫ్, వైస్ చైర్మన్ రాము, డైరెక్టర్లు బాబు, కృష్ణ, వెంకీ, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్ర గ్రంథాలయంలో "చదువంటే మాకిష్టం" నిర్వహించడమైనది.



చదువంటే మా కిష్టం కార్యక్రమంలో విద్యార్థులు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

అనంతపురం అనంతపురం జిల్లా కేంద్ర గ్రంధాలయంలో చదు వంటే మాకిష్టం కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమం నందు శిక్షకులు రిటైర్డ్ టీచర్ పుట్లూరు శ్రీరాములు, తెలుగు ఆచార్యులు కళాభూషణ్ డాక్టర్ అంకె రామలిం గమయ్య, పిల్లలకు నీతికథలు, తెలుగు పద్యాలు, ఆంగ్లములో గ్రామర్ భోదించారు. ఈ సందర్భంగా కార్యక్ర మంలో విద్యార్థిని విద్యార్థులు చదువంటే మాకిష్టం కార్యక్రమంను సద్విని యోగం చేసుకోవాలని తెలిపారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రతి ఒక్కరు పాఠ్యపుస్తకాలతో పాటు గ్రంథాలయం ను ఉపయోగించుకొని జీవితం లో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షంచారు. ఈ సందర్భంగా ప్రపంచం తెలుగు కవుల మహాసభల యందు సన్మానం పొందిన కళాభూషణ్ డాక్టర్ అంకె రామలింగమయ్య గారిని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రస్తుత కార్యదర్శి పి.కమ్మన్న, సిబ్బంది ఉజ్జనేశ్వరి సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు

## జిల్లా ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంల అసోషియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



డా.ఎస్.రామాంజినేయులు



కె.సత్యనారాయణరెడ్డి



ప్రతాప్‌రెడ్డి

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్స్ భవనంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సమావేశమై కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పిఎస్‌హెచ్ ఎం రాష్ట్ర అధ్యక్షులు సివి.ప్రసాద్, అసోషియేట్ ప్రెసిడెంట్ పాటిల్ రంగారెడ్డి తెలిపారు. వీరు పిఎస్‌హెచ్‌ఎంలు ఎదుర్కొం టున్న సమస్యలపై జిల్లా కార్యవర్గంలో చర్చించారు. అనంతపురం జిల్లాలో పిఎస్‌హెచ్‌ఎంలు వివిధ సమస్యలను రాష్ట్ర శాఖ దృష్టికి తీసుకొని వెళ్లారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా పి.అశోక్ కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు డా.ఎస్. రామాంజినేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణరెడ్డి, అదనపు కార్యదర్శి ఆర్.పరుశప్ప, కోశాధికారి ఎస్.హెచ్.ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు డి.చితంబరరెడ్డి, బాలసుబ్ర హ్మణ్యం, కె.గోవిందు, అసోషియేట్ ప్రెసిడెంట్స్ సి.భాస్కర్, వి.సర్దానప్ప, జిల్లా కార్యదర్శులు కె.ఎర్రిస్వామి, కె.శివశంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## పలు వివాహా కార్యక్రమాలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి





శుభకార్యాలలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

ఆదివారం మండల పరిధిలోని పలు వివాహా కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిం చారు. నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పాటుగా మండల కన్వీనర్ సాకే వెంకటేష్, యూత్ కన్వీనర్ విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రజకులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

దేవుని దర్శనానికి వెళ్లిన రజకులపై అత్యంత కిరాతకంగా దాడి చేసిన నిందితులను కఠినం గా శిక్షించాలని రజక సంఘం నాయకులు ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నగరం లోని బిఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు నాగర్ కర్నూల్ కొము రెల్లి మల్లన్న ఆలయంలో రజక కుటుంబంపై దాడి చేయగా రెండు నెలల పసిపాప మృతి చెందడం బాధాకరమని రజక సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ.. కొమురెల్లి మల్లన్న దర్శనం కోసం రజక కుటుంబం వెళ్లిందని ఆలయ ప్రవేశం విషయంలో వివక్షత కనబరుస్తూ కులం పేరుతో దూషిస్తూ దాడి చేసిన సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి తుకారం రెడ్డిలను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. రజక కుటుంబీకులు ఎంత ప్రాధేయపడిన వినకుండా గంటల తరబడి ఆలయ ఉండి రూములో బంధించి విచక్షణ రహితంగా దాడి చేయడంతో రెండు నెలల పసిపాప మృతి చెందడం మరింత బాధాకరమన్నారు. అనేక చోట్ల రజకులపై దాడులు దౌర్జన్యాలు కొనసాగుతున్న అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమ య్యారన్నారు. కార్యక్రమంలో అనిల్ ఆంజనేయులు రామాంజనేయులు ఈశ్వంయ్య ఆంజనేయులు నారాయణ. నాగన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో రైతు మృతి



మృతిచెందిన రైతు కిష్టప్ప

ముదిగుబ్బ, ఫిబ్రవరి 22. ప్రభాతవార్త

మండల పరిధిలోని గుంజేపల్లి గ్రామ సమీపాన వెంకటనారాయణ తోటలో విద్యుత్ సరఫరా రాకపోవడంతోతనస్నేహితుడైన కృష్ణప్పను తన తోట దగ్గరకు తీసుకొని వెళ్ళాడు. అయితే కిష్టప్ప ప్లంబర్ పని చేస్తుండేవాడు అందుకనే కిష్టప్పను స్టార్టర్ పెట్టెలో సమస్య ఉందని చూపించడం జరిగింది. అయితే కిష్టప్ప స్టార్టర్ పెట్టుకి కరెంటు సప్లై కాలేదని సమీపంలో ఉన్న ట్రాన్స్ఫారం దగ్గరకు వెళ్లి చూడగా పైన ఉన్నఎగ్జిఫీజులు సరిగాలేక పోవడం తోట్రాన్స్ఫారం పైన ఉన్న తీగలను వేయడానికి వెళ్లగా కరెంటు సప్లై ఉండి కూడా ఎగ్జి ఫీజులు వేయడానికి పైకి ఎక్కడంతో ఒక్కసారిగా 33 కెవి లైన్ తగలడంతో అక్కడికక్కడే కింద పడిపోయి మృతి చెందాడు. వివరాల్లేకెళ్తే కిష్టప్పకు కరెంటు పని పూర్తి తెలిసిన వ్యక్తి అయి ఉండి ఇలాంటి ప్రమాదానికి గురి కావడం ఆందోళనకరం.కిష్టప్ప మృతి చెందిన విషయం తన కుటుంబ సభ్యులకు తెలియడంతో భార్య తల్లి తండ్రి కిష్టప్ప మృత దేహం పై పడి బోరున విలపించారు. ఈ వృద్ధాప్యంలోఉన్న తల్లిదండ్రు లకు ఇతనే అన్ని చూసుకునే వ్యక్తిని అలాంటి వ్యక్తి మృతి చెందడంతో వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయారు. అయితే కిష్టప్ప ఈ మధ్యకాలంలోనే పెళ్లి చేసుకున్నట్లు తెలుస్తోంది ఇతనికి ఇంకా పిల్లలు కూడా లేరని వారి బంధువులు తెలిపారు. కిష్టప్ప కరెంటు పనిలో ఆరితేరిన వ్యక్తి అని అయినా ఇతను ట్రాన్స్ఫారం పైకి ఎక్క డంఅందరూ ఆశ్చర్యం వేస్తోంది.సంఘటనా స్థలానికి ముదిగుబ్బ పోలీసులు వెళ్లి వారి తల్లిదండ్రుల ఫిర్యాదు నేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం కదిరికి తరలించారు

## జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం

### - విద్యార్థులు, తల్లిదండ్రులు ఎలాంటి పుకార్లను నమ్మొద్దు - సందేహాల నివృత్తి కొరకు ప్రాంతీయ పర్యవేక్షణ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు 08554 277626 - యం.వెంకటరమణ నాయక్, కన్వీనర్, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

నేటి (సోమవారం) నుండి జరగబోయే ఇంటర్మీడియట్ పరీక్షలకు 64 కేంద్రలలో అన్ని మౌలిక వసతులను కల్పించినట్లు, విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలను ఒక గంట ముందే చేరుకోవాలని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాయుటకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వెంకటరమణ నాయక్ తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సామాజిక మాధ్యమాలలో వచ్చు పుకార్లను నమ్మరాదని, జిల్లాలో ప్రశ్నాపత్రాల కొరత లేదని, ప్రశ్న పత్రాలపై సందిగ్ధం లేదని, కావున విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎలాంటి భయాందోళనకు గురి కానవసరం లేదని, విద్యార్థుల, తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేయుటకు ప్రాంతీయ పర్యవేక్షణ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు, (08554 277626) కావున విద్యార్థులు లేదా తల్లితండ్రులు తమ సందేహాలను కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేసి నివృత్తి చేసుకోవలయునని తెలియచేసారు. పరీక్షహాల్‌లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్, స్మార్ట్ వాచ్ లు తీసుకు వెళ్ళరాదు. హాల్ టికెట్ తప్పని సరిగా తీసుకువెళ్లాలి. పరీక్ష వ్రాయు విద్యార్థులు పరీక్ష హాల్‌లో తను వ్రాస్తున్న సబ్జెక్టుకు సంబంధించిన ప్రశ్నపత్రము అందిందా లేదా సరి చూసుకోవలె నన్నారు. అలాగే పరీక్షల పర్యవేక్షణకు జిల్లా పరీక్షణ నిర్వహణ కమిటీ సభ్యులతో పాటు రెండు ఫ్లయింగ్ స్కాడ్‌లను, ఎనిమిది మంది సిట్టింగ్ స్కాడ్‌లను నియమించడం జరి గిందని, పరీక్షలు జిల్లాలో ఎలాంటి విమర్శలకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించుటకు అన్ని చర్యలు తీసుకున్నట్లు యం.వెంకట రమణ నాయక్, కన్వీనర్, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి తెలిపారు.

## ఆరోగ్యం మన బాధ్యత - ఆరోగ్యమే మహాభాగ్యం

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

ఆరోగ్యం మన బాధ్యత ఆరో గ్యమే మహాభాగ్యం మన చేతుల్లో మన ఆరోగ్యం అని కొప్పు ల రమ ణ (రవికాంత్ క్యాటర్స్) అన్నారు. ఆదివారం బుక్క రాయ సముద్రం మండల కేంద్రంలో ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్ వారి ఆధ్వర్యంలో రవికాంత్ క్యాటరర్స్ రమణ వారి ఆర్థిక సహాయంతో ప్రాథమిక పాఠశాల్లో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో సుమారు 350 మంది రోగగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచిత ంగా మందులు పంపిణీచేశారు. ఇందులో కంటి పరీక్షలు నిర్వహించి 100 మందికి కంటి అద్దాలు అందజేశారు. అనంతరం ఆదిత్య మల్టీ స్పెషాలి టీ ఆసుపత్రికి చెం దిన నాగరాజు, జనరల్ సర్జన్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రాజశేఖర్, స్వరూప్ గైనకాలజిస్ట్, డాక్టర్ ఆర్ శ్వేత, మదన్, ఐ హాస్పిటల్ డాక్టర్ ఎస్ మదన్మోహన్‌రెడ్డి, వారందరు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు కేశన్న, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మినారాయణ, మాజీ కన్వీనర్ అశోకుమార్, ఎస్.నారాయ ణస్వామి, ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు నాగేంద్ర, సూర్యనారాయ ణరావు, సత్యనారాయణ, రామమోహన్, ప్రభాకర్, శివకుమార్, శ్రీనివాసులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

## చిన్న పిల్లల వైద్య శిభిరానికి విశేష స్పందన

కదిరి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

పట్టణంలోని రిషిత చిన్న పిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత చైల్డ్ డెవలప్‌మెంట్ క్యాంపుకు విశేష స్పందన లభించింది. ఈ ఉచిత వైద్య శిభిరంలో తిరుపతి సంజీవ్‌చైల్డ్ డెవలప్‌మెంట్ వారి సహకారంతో నిర్వహించారు. ఉచిత వైద్య శిభిరంలో సుమారు 70 మంది పిల్లలకు వైద్య చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా.మధన్ కుమార్ మాట్లాడుతూ.. మారుతున్న కాలంతోపాటు పిల్లల పెంపకంలో కూడా చాలా మార్పులు వచ్చాయన్నారు. పిల్లలకు మొబైల్ అనేది ఎక్కువగా ఇవ్వడం, వాడటం వల్ల పిల్లలు మానసిక ప్రవర్తనపై ప్రభావం పడుతోందని, దాని వలన వచ్చే నష్టాలు, మొబైల్ చూడటం వల్ల డి అడిక్షన్ చేసుకోవాలో క్లుప్తంగా వివరిం చారు. పిరియాడిక్, స్పీచ్, లాంగ్వేజ్, పెతాజిస్టు శైలజా మాట్లా డతూ.. పిల్ల లకు ఈ అటిజం, ఎడి హెచ్‌డి, స్పీచ్, డిలే డెవలప్‌మెంట్, డిలే లాంటివి త్వరగా ట్రీట్‌మె ంట్ ఇవ్వడం ద్వారా చాలా త్వరగా ఉంటుందన్నారు. అడి యా లజిస్ట్ ప్రసన్నకుమార్ మాట్లాడు తూ. .పిల్లలు, పెద్దలకి వినికిడి పరీక్షలు నిర్వహించామ ని, ఫిజి యోథె రఫిస్ట్ లవన్య ద్వారా బుద్ధి మాంధ్యం గల పిల్లలకు ఫిజియోథెరఫీ ఉచితంగా చేశామన్నారు. ఈ వైద్య శిభిరంలో స్పీచ్ తెరఫీ, బిహేవియర్ థెరఫీ, ఆక్యుపేషనల్ థెరఫీ, ఫిజియో థెరఫీలు ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అత్తర్ మహబూబ్‌బాషా, తాహీర్ అలీ, అజం తుల్లా, డెవలప్‌మెంట్ సిబ్బంది, రిషితా వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య చికిత్సలు నిర్వహిస్తున్న డా.మదన్‌కుమార్, శైలజా

## చేనేత గర్జనకు తరలివెళ్లిన నాయకులు

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

మంగళగిరిలో ఆదివారం జరిగిన చేనేత గర్జనలో తాడిపత్రి ప్రాంతానికి చెందిన పలువురు చేనేత నాయకులు తరలివెళ్లారు. ఇందులో భాగంగా ముఖ్యఅతిథిగా ర్యాలీలో జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి రుషింగప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయించకుండా చేనేత కార్మికులకు అన్యాయం చేశారన్నారు. ఇప్పటికైనా 2 వేల కోట్ల రూపాయలు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి నేతన్న నేస్తం పథకం 25 వేలు వెంటనే అమలు చేయాలని అలాగే నూలు పట్టు రాయితీ మహాత్మాగాంధీ బునకర్ యోజన పథకం పునర్ధన చేసి ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలని చేనేత పింఛన్లకు నిబంధనలు సడలించి ప్రభుత్వం వెంటనే అమలులోకి తీసుకురా వాలని చేనేత కార్మికులకు పని కల్పించి చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలకు గిట్టుబాటు ధర కల్పించి చేనేత వస్త్రాలపై జిఎస్‌టి తొలగించాలని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.




ర్యాలీలో పాల్గొన్న రుషింగప్ప

## అంగరంగ వైభవంగా వాల్మీ మహర్షి విగ్రహం ఊరేగింపు

శింగనమల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

నేడు ప్రతిష్టించనున్న వాల్మీకి మహర్షి విగ్రహం ఆదివారం గ్రామస్తులు వాల్మీకి సోదరులు పెరవలి గ్రామంలో పెద్ద ఎత్తున బాణాసంచాలు కాలుస్తూ బ్యాండు మేళంతో ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కట్టెల కోలన్న ప్రజలను ఆకర్షించింది. అనంతరం రాత్రి అంతా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేడు తెల్లవారు జామున వవిగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేయనున్నట్లు వాల్మీకి సోదరులు, గ్రామస్తులు తెలిపారు. ఈ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి అనంతపురం ఎంపి అంబికా లక్ష్మినారాయణ, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు.



వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



కోలన్న వేస్తున్న కళాకారులు

## 10 మంది పేకాటరాయుళ్లు అరెస్ట్

### - రూ.72,980 నగదు, 3 మోటార్ సైకిళ్లు, 11 సెల్ ఫోన్లు సీజ్

తాడిపత్రిఅర్బన్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

తాడిపత్రి మండలం వెలమకూరు గ్రామ పొలాల్లోని కంప చెట్లల్లో పేకాట ఆడుతున్న 10 మందిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు జిల్లా ఎస్‌పి జగదీష్ ఆదేశాల మేరకు, తాడిపత్రి ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి ఉత్తర్వుల మేరకు స్పెషల్ పార్టీ సిబ్బందితో కలిసి దాడులు జరిపి పేకాట ఆడుతున్న చింబిలి బాబూజీనాయుడు, మంగళ నారాయణస్వామి, బందుగల్ల గుర్రప్ప, కనకం శ్రీరాములు, మంచాల ఈశ్వర్‌రెడ్డి, ఉమ్మలరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, చింతమాను శ్రీనివాసులు, దేరంగుల పెద్దిరాజు, సంజావుల శివప్రసాద్, వడిపిల్ల రాజులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 72,980 రూపాయల నగదుతో పాటు 3 మోటార్ సైకిళ్లు, 11 సెల్‌ఫోన్లను స్వాదీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.



పేకాటరాయుళ్లను చూపుతున్న దృశ్యం

## రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి

తాడిపత్రిఅర్బన్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలో ఆదివా రం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 179 వ వర్ధంతిని ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా స్థాని క బస్టాండ్ సర్కిల్‌లోని ఉయ్యా లవాడ నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తొలితరం స్వాతంత్ర సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని ఆయన సేవలను కొనియా డారు. అప్పట్లో బ్రిటీష్ వారిని ఎదిరించేందుకు తన ప్రాణాలను సైతం లెక్కచేయలేదని అలాంటి వీరుని విగ్రహాన్ని తాడిపత్రి పట్టణంలో ఏర్పాటు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. అలాంటి మహానుభావుల అడుగు జాడల్లో నేటి యువత పయనించాలని వారు కోరారు. ఈ కార్యక్ర మంలో రెడ్డి సంఘం అధ్యక్షులు పిచ్చిరెడ్డి, కన్వీనర్ లాయర్ రమేష్‌నాథ్‌రెడ్డి, ఉపా ధ్యక్షులు నాగేశ్వర్‌రెడ్డి. బాలసుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇంద్రసే నారెడ్డి, కోశాధికారి అంబటి రాఘవేంద్రారెడ్డి, ఏపిహెచ్‌ఎస్‌జి స్టేట్ సెక్రటరీ, మాజీ ఆలయ చైర్మన్ బాణా నాగేశ్వర్‌రెడ్డి, రెడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యంన

## వాల్మీకి మహర్షి విగ్రహ ఏర్పాటుకు అభినందనలు

### - టిడిపి మండల కన్వీనర్ గోరంట్ల మారుతినాయుడు



మాట్లాడుతున్న గోరంట్ల మారుతినాయుడు

శింగనమల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

మండల పరిధిలోని పెరవలి గ్రామంలో గ్రామస్తులు వాల్మీకి సోదరులు కలిసి వాల్మీకి మహర్షి విగ్రహ ఏర్పాటు చేయడాన్ని అభినందిస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ గోరంట్ల మారుతినాయుడు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో తన నివాసంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ ఐక్యమత్యంగా వాల్మీకి మహర్షి విగ్రహ ఏర్పాటులో పాల్గొనాలని కొందరు గ్రామం ప్రశాంతంగా ఉండటం ఇష్టం లేక వాట్సాప్ గ్రూపుల్లో రెచ్చగొట్టేప్రకటనలు పెడుతున్నారని, అటువంటి విమాను కోవాలన్నారు. గ్రామం ప్రశాంతంగా ఉండటం, అభివృద్ధి వైపు తీసుకెళ్లడమే తమ పూర్వీకుల నుంచి కృషి చేస్తున్నామని ఇప్పటికీ అదే పంతాను కొనసాగిస్తున్నామని గతంలో పెరవలి గ్రామం అభివృద్ధికి అనంత పురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, మేయర్ మదమ ంచి స్వరూప, ఎమ్మెల్సీ మెట్టు గోవిందరెడ్డి నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహి ంచామని ఆయన పేర్కొన్నారు. ప్రజలందరూ శాంతి పూర్వకంగా విగ్రహ ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్ర మంలో పలువురు గ్రామస్తులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## సోదనపల్లిలో పలువురికి అస్వస్థత



సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న సోదనపల్లి గ్రామస్తులు

శింగనమల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

మండల పరిధిలోని సోదనపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం, ఆదివా రం ఉదయం పలువురు వాంతులు, విరేచనాలకు, అస్వస్థతకు గురయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గ్రామం లోని ఎస్సీ కాలనీలో ఒకే వీధిలో ఉన్న దాదాపు ఏడెనిమిది కుటుంబాలలో మహిళలు, పురుషులకు వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వ స్థతకు గురి కావడంతో వారిని మండల కేంద్రంలోని కమ్యునిటీ హెల్త్ సెం టర్‌లో చికిత్స కొరకు చేర్పించారు. మెడికల్ ఆఫీసర్ డా.రోహినాత్ మాట్లాడుతూ.. సోదన పల్లి గ్రామం నుంచి 10కేసులు గ్యాస్ట్రో ఎంటరైటిస్ కేసులు వచ్చాయని, ఇది ఫుడ్ పాయిజనింగ్ వల్ల కావచ్చు అని తెలిపారు. అయితే రోగులందరూ సురక్షితంగా, స్థిరంగా ఉన్నారని, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఎప్పటికప్పుడు రోగుల పరిస్థితి గురించి తమను అడిగి నిరంతరం పర్యవేక్షి స్తున్నారన్నారు. రోగులు త్వరగా కోలుకోవడానికి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

## బాధితుల కుటుంబాలకు అండగా ఉంటాం

### - శింగనమల మార్కెట్‌యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు



బాధితులను పరామర్శిస్తున్న దండు శ్రీనివాసులు

శింగనమల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

మండల పరిధిలోని సోదనపల్లి గ్రామంలో వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై శింగనమల కమ్యునిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు శింగనమల మార్కెట్‌యా ర్డు చైర్మన్ దండు శ్రీనివాసులు ఆ పార్టీ నాయకులతో కలిసి బాధితులను పరామర్శించారు. బాధిత కుటుం బాలకు ధైర్యంచెప్పి అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగుల పరిస్థితి నిలకడగా ఉందని ఎటువంటి ప్రమాదం లేదని తెలిపారు. గ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం, అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. ఆయన వెంట తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార పార్టీ కాయల అనిల్‌కుమార్ యాదవవ్, మాజీ వైస్ ఎంపిపి సి.వెంకటేష్, టిడిపి నాయకులు గంగాధర్, బెస్త నారాయణస్వామి, కాలయ సురేష్ యాదవ్, మసూద్‌వలి, మునీంద్ర, బాబావలి, గొల్లప్ప తదితరులు ఉన్నారు.

## నేడు పెద్దమ్మతల్లి విగ్రహప్రతిష్ఠ

పుట్లూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

పుట్లూరు మండలం గోపురాజుపల్లి గ్రామంలో సోమవారం పెద్దమ్మతల్లి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఉదయం 11.22 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహి ంచడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాసన, నాంది పూజ, ప్రధాన కలశస్థాపన, జలాధివాసం, ధాన్యాధివాసం, పంచామృత అభిషేకాలు, హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. హాజరైన భక్తులకు మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరం చేశారు. గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పెద్దమ్మతల్లి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని గ్రామ పెద్దలు, నిర్వాహకులు తెలియచేశారు.

### గృహ ప్రవేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

రాప్తాడు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

పావగడ తాలూకా నాగలమడక మండలం పెండ్లిజీవి గ్రామానికి చెందిన క్రిష్ణారెడ్డి గృహ ప్రవేశానికి రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, పావగడ మాజీ ఎమ్మెల్యే తిమ్మరా యప్పలు హాజర య్యారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రె డ్డికి తిమ్మ రాయప్పలకు కృష్ణారెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భ ంగా వారు శుభాకాంక్షలు తెలియజేశారు.

## రూ.37 వేల కోట్లు బకాయిలు విడుదల చేయాలని కాంట్రాక్టర్ల డిమాండ్



పత్రిక గోష్టి లో మాట్లాడుతున్న దృశ్యం.

బళ్ళారి ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:

బళ్ళారి నగరంలోని రాయల్ ఫోర్ట్ హోటల్ నందు పత్రిక గోస్ట్ లో కర్ణాటక కాంట్రాక్టర్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు ఆర్.మంజునాథ మాటాడుతూ, గత రెండున్నర సంవత్సరాలుగా టెండర్ పనులు పూర్తి చేసినప్పటికీ రూ.37,000 కోట్ల బకాయిలు ప్రభుత్వం విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పనులు చేసిన కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. "ఇలా కొనసాగితే విషం తాగే పరిస్థితి వస్తుంది" అని అన్నారు. మార్చి 6న బెంగళూరులో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల మంది కాంట్రాక్టర్లు సమ్మె నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించకపోతే ఏప్రిల్ నుంచి నిరవధిక సత్యాగ్రహం చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంలో కర్ణాటక కాంట్రాక్టర్ అసోసియేషన్ బళ్లారి జిల్లా అధ్యక్షులు ఎస్ జి రమణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జి ఉమామహేశ్వర్ గౌడ, పరశురాం, తూర్పు వీరేష్, ఖజంచి పి ఎర్రి బసవన్న గౌడ్, జెంటి కార్యదర్శులు కేఎం ప్రవీణ్ కుమార్, హెచ్ సిద్దేశ్, సలహాదారులు ఏ కె నాగరాజ్, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

